సాక్షి ఒడిశా

గురువారం । 25 । ఏప్రిల్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,95,917లు, బంగారం 530 మిల్లీగ్రాములు ,వెండి 56 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



సందడే.. సందడి

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నాలుగో విడత నామినేషన్లకు గడువు సమీపిస్తుండడంతో రాష్ట్రవ్యాప్తంగా బుధవారం పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి.

- 8లో



అంబులెన్స్‌లో మంటలు

గజపతి జిల్లా కలెక్టరేట్ వద్ద అధికారులు బుధవారం ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్‌లో మంటలు చెలరేగాయి.

- 8లో

న్యూస్‌రీల్

లగ్న లోకిత్‌కు అభినందనలు



లోకిత్‌ని అభినందిస్తున్న గవర్నర్ రఘుబర దాస్

భువనేశ్వర్: మొక్కలు, చెట్లుపై ఎనలేని ఉత్సుకతతో అద్భుతమైన జ్ఞాపకశక్తి ప్రదర్శించిన మాస్టర్ లగ్న లోకిత్‌ను రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్ ప్రత్యేకంగా అభినందించారు. పూరీలో ఉంటున్న ఈ బాలుడు తన అద్భుత జ్ఞాపకశక్తితో లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించడం విశేషం.

గంజాయితో వ్యక్తి అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితుడు

జయపురం: స్థానిక ఎక్సైజ్ రేంజ్ కార్యాలయ సిబ్బంది 22 కేజీల గంజాయిని బుధవారం పట్టుకున్నారు. అలాగే ఒక నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శశికాంత దత్ బుధవారం వెల్లడించారు. అరెస్టైన వ్యక్తి బొయిపరిగుడ పోలీసుస్టేషన్ పరిధి జబా గ్రామానికి చెందిన రవీంద్ర పాత్రో(24) అని వెల్లడించారు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని వెల్లడించారు.

పర్లాకిమిడిలో కుండపోత



కుండపోత వర్షం కురుస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: పట్టణంలో బుధవారం ఉదయం 44 డిగ్రీల అత్యంత అధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా, మధ్యాహ్నం 3.00 గంటల సమయంలో కారుమబ్బులతో అరగంటసేపు కుండపోత వర్షం కురిసింది. దీంతో ప్రజలు వేడి నుంచి ఉపశమనం పొందారు. వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

పుంజాపాయిలో దారుణ హత్య



లచ్చ మండంగి మృతదేహం

రాయగడ: జిల్లాలోని కుంబికోట పోలీసుస్టేషన్ పరిధి పుంజాపాయిలో దారుణ హత్య జరిగింది. పాత కక్షలతో ఒకరిని దారుణంగా గొడ్డలితో నరికి చంపిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకున్న రాయగడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు మేరకు.. పుంజాపాయి గ్రామానికి చెందిన లచ్చ మండంగి (55)కి, అదే గ్రామానికి చెందిన మదన్ మండంగి (35)కి మధ్య గత కొన్నేళ్లుగా విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తరచూ ఇద్దరి మధ్య చిన్న చిన్న గొడవలు చోటుచేసుకుంటున్నాయి. బుధవారం ఉదయం లచ్చ మండంగి తన మేనల్లుడితో పొరుగు ఊరు వెళ్లేందుకు అడవి దారిన బయల్దేరాడు. ఇదే అదునుగా భావించిన మదన్ అడవిలో కాపలా కాసాడు. అడవి మధ్యకు వారు చేరేసరికి మదన్ లచ్చతో గొడవపడ్డాడు. దీంతో ఇద్దరి మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం కోపొద్రేక్తుడైన మదన్ తనతో తీసుకు వెళ్లిన గొడ్డలితో లచ్చపై దాడిచేసి దారుణంగా హత్య చేశాడు. లచ్చ వెంట ఉన్న ఆయన మేనల్లుడు పరుగున వెళ్లి విషయాన్ని గ్రామస్తులకు తెలియజేశాడు. గ్రామస్తులంతా సంఘటన స్థలానికి చేరుకుని మదన్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించాడు. అయితే తన దగ్గరకు వచ్చిన వారిపై దాడి చేస్తుండడంతో భయపడ్డ గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అడవులో గాలించి మదన్‌ను పట్టుకుని అరెస్టు చేశారు.

రాష్ట్రాభివృద్ధే నా ధ్యేయం





- సీఎం నవీన్ పట్నాయక్
- గంజాం జిల్లాలో ఎన్నికల ప్రచారం

సీఎం నవీన్ పట్నాయక్‌కు గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

భువనేశ్వర్/బరంపురం:

రాష్ట్రాభివృద్ధే తన ధ్యేయమని సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. గంజాం జిల్లా హింజిలికాట్ నియోజకవర్గం సరగడలో జరిగిన ఆ పార్టీ బహిరంగ సభలో బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒడిస్సా రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేశంలో మొట్ట మొదటిసారిగా గంజాం జిల్లాలోని ఎన్‌ఏసీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిల్లో బస్తీ వాసులు 2,000 మందికి 'భూమి అధికారి' పట్టాల పంపిణీ పథకం ప్రారంభించినట్లు చెప్పారు. ఇది దేశంలోనే ఒక చరిత్రాత్మకమైన ఘటమని పేర్కొన్నారు. రాష్ట్ర పేద ప్రజలను ఆదుకోవడానికి ఎల్లప్పుడూ ముందు ఉంటానని తెలియజేశారు. గడిచిన 22 ఏళ్ల బీజేడీ పాలనలో 50కి పైగా ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు చెప్పారు. తాను మాటల మనిషిని కాదని, చేతల్లో అభివృద్ధి పనులు చేసి చూపుతానని చెప్పారు. ఎన్‌ఏసీ, పట్టణ, నగరాల్లో ఉన్న బస్తీ వాసులకు తొలి దశలో 2.5 లక్షల మందికి 'భూమి అధికారి' పట్టాలు పంపిణీ చేశామన్నారు. ఇప్పటికే 50 శాతం పూర్తి అయిందన్నారు. బస్తీ వాసులు పొందిన భూమి హక్కు పట్టాల ద్వారా బ్యాంక్ రుణాలు, పిల్లల చదువులకు రుణాలతో పాటు ఉన్నత విద్యా అభ్యసించగలరని చెప్పారు. దీని ద్వారా ఒకే కుటుంబంలో అందరూ విద్యావంతులయ్యే విధంగా మేలు జరుగుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధే తన లక్ష్యమని, అయితే తరుచూ వస్తున్న ప్రకృతి వైపరీత్యాల వలన అభివృద్ధికి కొంత అటంకం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

2036 నాటికి దేశంలోనే నంబర్ వన్

ఒడిశా ఏర్పాటై 100 ఏళ్ల పూర్తయ్యే 2036 నాటికి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రతిజ్ఞ చేశారు. యువత సాధికారతపై బలమైన ప్రాధాన్యతతో 10 సంవత్సరాల అభివృద్ధి ప్రణాళికను వివరిస్తూ, అతను 'జోడి శంఖ' (లోక్‌సభ మరియు విధానసభ అభ్యర్థులు) ఇద్దరికీ ఓట్లు వేయాలని అభ్యర్థించారు. పూరీ శ్రీ జగన్నాథ మందిరం ప్రాకార పథకం, ఏకామ్ర ప్రాజెక్ట్, సమలెయి ప్రాజెక్ట్ సహా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను విపక్షాలు వ్యతిరేకించడం విచారకరంగా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసే ప్రతీ సానుకూల చర్యను విపక్షాలు రాజకీయం చేస్తున్నాయని దుయ్యబట్టారు. రాష్ట్రంలో జరగబోయే జంట ఎన్నికల్లో వారికి ప్రజలు గుణపాఠం నేర్పాలని నవీన్ పట్నాయక్ పిలుపునిచ్చారు. ఆరోగ్యం, విద్య, విపత్తు నిర్వహణతో పాటు అనేక రంగాల్లో ఒడిశా అగ్రగామిగా ఉందన్నారు. మహిళా సాధికారత, పెట్టుబడులను ఆకర్షించడం, బిజూ స్వాస్థ్య కళ్యాణ్ యోజన (బీఎస్‌కేవై) వంటి అనేక కార్యక్రమాల్లో ఒడిశా జాతీయ స్థాయిలో అగ్రగామిగా కొనసాగుతుందని పేర్కొన్నారు. రైతుల కోసం ప్రత్యేక బడ్జెట్ ఆవిష్కరించిన తొలి సర్కారు బీజేడీ దేనని సగర్వంగా ప్రకటించారు. రానున్న రోజుల్లో యువత కోసం బడ్జెట్‌ను ప్రవేశపెట్టే యోచన ఉందన్నారు. యువత కోసం పారిశ్రామిక పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారిస్తామని తెలిపారు. రాష్ట్రంలో 4.5 కోట్ల మంది ప్రజలు నా కుటుంబమని, వారి కోసం చివరి వరకు పని చేస్తూనే ఉంటానని నవీన్ పట్నాయక్ తన ప్రసంగాన్ని ముగించారు. కార్యక్రమానికి 5టీ, నవీన్ ఒడిశా చైర్మన్ వి.కార్తికేయ పాండియన్, పలువురు సీనియర్ బీజేడీ నాయకులు, మంత్రులు హాజరయ్యారు.



బహిరంగ సభలో యువతరం ప్రదర్శన



సీఎం బహిరంగ సభలో పాల్గొన్న జన సందోహం

బంగిరిపొషిలో పోటీ రసవత్తరం



సంజలి ముర్ము



రంజిత మరాండి

భువనేశ్వర్: మయూరభంజ్ జిల్లా బంగిరిపొషి నియోజకవర్గంలో పోటీ రసవత్తరంగా మారింది. ఈ స్థానంలో విద్యాధిక యువతి, ఉపాధ్యాయ వృత్తి నుంచి వైదొలిగిన ఒకే కుటుంబానికి చెందిన మహిళల మధ్య ముఖాముఖి పోరు నెలకొంది. గత 2019 ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అప్పుడు పినతండ్రి, కొడుకు తలపడ్డారు. ఈ పోరులో కొడుకు విజేతగా నిలిచారు. అప్పుడు భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా సుగడా మరాండి, బిజూ జనతా దళ్ అభ్యర్థిగా సుదాం మరాండి తలపడ్డారు. పినతండ్రిపై సుమారు 6 వేల పైబడిన ఓట్ల ఆధిక్యంతో కొడుకు సుదాం మరాండి విజయం సాధించారు. ఈసారి జరుగనున్న ఎన్నికల్లో వీరిరువురూ ప్రత్యక్ష పోరు నుంచి తప్పుకుని కుటుంబీకులను పోటీకి నిలబెట్టారు. సుగడా మరాండి కుమార్తె సంజలి ముర్ము, సుదాం మరాండి భార్య రంజిత మరాండి బరిలోకి దిగారు. సంజలి ముర్ము విద్యాధికురాలు. దళిత యువ నేత్రిగా స్థానికుల అభిమానం చూరగొంది. మరోవైపు ఆమె వదిన రంజిత మరాండి ఉపాధ్యాయురాలిగా, మాజీ మంత్రి సతీమణిగా గౌరవప్రదమైన ప్రజా గుర్తింపు పొందిన అభ్యర్థిగా ప్రత్యక్ష పోరుకి సిద్ధమైంది. బిజూ జనతా దళ్ అభ్యర్థిగా రంజిత మరాండి, భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా సంజలి ముర్ము మధ్య ద్విముఖ పోటీ నువ్వా నేనా అన్నట్లు సాగుతోంది. ఈ పోటీలో ఎవరు గెలుస్తారోనని రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

వాహన తనిఖీల్లో రూ.30 లక్షలు పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి ఛలాన్‌గూడ గ్రామం వద్ద మంగళవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో ఛత్తీస్‌గడ్ రాష్ట్రం సుకుమ జిల్లా నుంచి మల్కన్‌గిరికి వస్తున్న ఒక కారును అపి తనిఖీ చేయగా రూ.30 లక్షల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీంతో కారు డ్రైవర్, మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. డబ్బులు ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారనే విషయంపై వారి నుంచి సరైన సమాధానం రాలేదని వెల్లడించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష



సార్వత్రిక ఎన్నికలు–2024 నిర్వహణపై రాష్ట్ర సన్నద్ధతను అంచనా వేయడానికి కేంద్ర పరిశీలకులు (సాధారణ, పోలీసు, ఖర్చులు) ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి కేంద్ర పరిశీలక బృందంతో ప్రధాన ఎన్నికల అధికారి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

– భువనేశ్వర్

రాష్ట్రంలో మార్పు రావాలి



మార్పు రావాల్సిందే పోస్టర్ ఆవిష్కరణ

- సుదీర్ఘ బీజేడీ పాలనలో అస్తవ్యస్తం
- బీజేపీ నాయకుల ఆరోపణ



బీజేడీ ప్రభుత్వంపై బుక్ విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

భువనేశ్వర్: ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో అధికార మార్పిడి జరగాల్సిన అవసరం ఉందని రాష్ట్ర బీజేపీ నాయకులు అన్నారు. స్థానిక రాష్ట్ర శాఖ కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బీజేడీ ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా రూపొందించిన నేరారోపణ చిట్టాని కెత్తె దిన్ ఔ సాహిబా, పారిబొర్తాన్ అణిబా (ఎంతకాలం సహిస్తాం, మార్పు తీసుకురావాల్సిన సమయం వచ్చింది) అనే శీర్షికతో బీజేపీ విడుదల చేసింది. కార్యక్రమంలో రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు బైజయంత్ పండా తదితరులు పాల్గొన్నారు. ఒడిశాలో కార్మికుల వలసలు, సంక్షేమ చర్యలు లేకపోవడం, ఉపాధి అవకాశాలు వంటి అనేక అంశాలను ఈ చిట్టాలో చేర్చారు.

సుపరిపాలన అందించేందుకు పోటీ

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ మాట్లాడుతూ.. కేంద్రం, రాష్ట్రంలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసి సుపరిపాలన అందించేందుకే బీజేపీ ఒడిశాలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తుందన్నారు. గత 25 ఏళ్లలో బీజేడీ ప్రభుత్వ పాలన వల్ల రాష్ట్ర ప్రజలు చాలా అన్యాయాలకు గురయ్యారని, దానిని అంతం చేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమ రంగాల్లో బీజేడీ సర్కారు ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. ఈ క్రమంలో ప్రజాదరణ క్రమంగా క్షీణిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సాగునీటి సౌకర్యాలు, గిడ్డంగులు వంటి అనేక హామీలు ఇచ్చినా అమలు చేయలేకపోయిందని ఆరోపించారు. 25 ఏళ్ల సుదీర్ఘ పాలనలో ఒడిశా ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని పెంచడం, నీటిపారుదల సౌకర్యాన్ని బలోపేతం చేయడం, 314 మండలాల్లో శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయడం, రైతులకు ఇతరేతర ప్రయోజనాలను అందించడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో అత్యధికులు ఉపాధి వనరులు కొరవడి, నిలువ నీడ లేక పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్తున్నారన్నారు. గతేడాది 40,000 మంది కార్మికులు రాష్ట్రం నుంచి బయటికి వలస వెళ్లారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసినప్పటికీ చిట్ ఫండ్ కుంభకోణంలో బాధితులైన 40 లక్షల కుటుంబాలకు తిరిగి చెల్లించడంలో నవీన్ పట్నాయక్ ప్రభుత్వం విఫలమైందని మన్మోహన్ సామల్ అన్నారు. రాష్ట్ర ప్రజల అభిప్రాయ సేకరణ ఆధారంతో నేరారోపణ చిట్టా సిద్ధం చేసినట్లు బీజేపీ ఎంపీ అభ్యర్థి బైజయంత్ పండా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తమిళనాడుకు తక్కువ ధరకు విద్యుత్ సరఫరా చేసి రాష్ట్ర ప్రజలకు ఎక్కువ ధరతో విద్యుత్ చార్జీల భారం మోపుతోందని ఆరోపించారు.

కరుణించు తల్లీ మజ్జిగౌరమ్మ

- ముగిసిన చైత్రోత్సవాలు
- అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు



అమ్మవారి ఘటాలు

రాయగడ: కోర్కెలు తీర్చే కల్పవల్లి మజ్జిగౌరి అమ్మవారి వార్షిక చైత్రోత్సవాలు బుధవారంతో ముగిశాయి. గత ఐదు రోజులుగా కొనసాగిన ఈ ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టాలైన మల్లెలు (నిప్పులు)పై నడవడం, ముళ్ల ఉయ్యాలలో పూజారి ఊగడం వంటి కార్యక్రమాలు మంగళవారం అర్ధరాత్రితో ముగిశాయి. ఈ ఆసక్తికర ఘట్టాలను వీక్షించేందుకు భక్తులు సుదూర ప్రాంతాల నుంచి మందిరానికి మంగళవారం సాయంత్రం నాటికే చేరుకున్నారు. ఛత్తీస్‌ఘఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలతో పాటు ఇటు తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు హాజరయ్యారు.

అమ్మవారి ఘటాల తిరువీధి

అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలు మంగళవారం స్థానిక పూజారి వీధి, బెంగాలీ వీధి నుంచి మెయిన్ రోడ్డు, ట్రెజరీ రోడ్డు మీదుగా శాతోభౌవుని అమ్మవారి మందిరానికి వెళ్లి తిరిగి వచ్చాయి. తిరువీధి కార్యక్రమం ముగించుకుని మందిరానికి చేరుకునేసరికి రాత్రి 11.30 గంటలయ్యింది. అంతకుముందు పూజారులు ప్రత్యేకంగా అమర్చిన నిప్పుల కొలువు, ముళ్లతో తయారు చేసిన ఊయలను సిద్ధం చేశారు. ఘటాలు మందిరానికి చేరుకున్న అనంతరం ఘటాలను మోసుకువచ్చే పూజారులు, ఆదివాసీ డప్పుల వాయిద్యకారులు ముందుగా సిద్ధం చేసిన ఎర్రటి నిప్పులపై నడిచారు. అదే విధంగా ముళ్ల ఊయలలో పూజారి ఊగడంతో ప్రధాన ఘట్టాలు ముగిశాయి.

దీక్షల విరమణ

అమ్మవారి ఉత్సవాల ప్రారంభం రోజు నుంచి ఉపవాసాలతో నిష్టగా పూజల్లో కూర్చున్న ఆలయ ట్రస్టు సభ్యులు మంగళవారంతో దీక్షలను విరమించారు. అనంతరం కొనసాగిన హోమం రాత్రి 9.30 గంటలకు పూర్ణాహుతితో ముగిసింది. ఈ హోమంలో టెంకాయ, నెయ్యి, ఎరుపు రంగు గుడ్డ, హోమం కర్రలను వేస్తే శుభం చేకూరుతుందని ఇక్కడి ప్రజల నమ్మకం. దీంతో ఆ సామగ్రి వేసేందుకు భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు.

బారులుతీరిన భక్తులు

ఉత్సవాల్లో చివరి రోజు అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. ఈ ఐదు రోజులు అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఉత్సవాలు ముగియడంతో బంగారు ఆభరణాలను తిరిగి ట్రెజరీలో భద్రపరుస్తారు. మళ్లీ అమ్మవారిని సునాబేసాలో దర్శించుకోవాలంటే దసర నవరాత్రుల్లోనే అవకాశం కలుగుతుంది. అందువల్ల అమ్మవారిని దర్శించుకునేందుకు స్థానికులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు క్యూ కట్టారు.



పూజలందుకుంటున్న మజ్జిగౌరి అమ్మవారు



ఆదివాసీ సాంస్కృతిక ఘుమురా నృత్యాలు



అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు



మల్లెల్లో పూజారి నడుస్తున్న దృశ్యం



దీక్షలు విరమించిన ట్రస్టు సభ్యులు



పూర్ణాహుతి పూజలు

క్లుప్తంగా

బుధవారం నామినేషన్లు 52

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బుధవారం 52 నామినేషన్లు దాఖలయ్యాయి. శ్రీకాకుళం ఎంపీ స్థానానికి సంబంధించి కింజరాపు రామ్మోహన్‌నాయుడు(టీడీపీ–2 సెట్లు), బోరుభద్ర చంద్రకళ(భారత చైతన్య యువజన పార్టీ), పేరాడ తిలక్(వైఎస్సార్‌సీపీ), కింజరాపు విజయకుమారి(టీడీపీ–2సెట్లు), బొమ్మాళి తిరుపతిరావు(పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), వాబ యోగేశ్వరరావు(ఇండిపెండెంట్–2 సెట్లు) నామినేషన్లు దాఖలు చేశారు.

అసెంబ్లీ స్థానాలకు సంబంధించి ఇచ్ఛాపురంలో మాసుపత్రి చక్రవర్తి రెడ్డి(కాంగ్రెస్), బెందాళం అశోక్(టీడీపీ–2 సెట్లు), బెందాళం నీలోత్పల(టీడీపీ), పిరియా విజయ(వైఎస్సార్‌సీపీ), పిరియా సాయిరాజ్(వైఎస్సార్ సీపీ), బడ్డి ముఖలింగం(భారత చైతన్య యువజన పార్టీ), పలాసలో దత్తి వీరాస్వామి(ఇండిపెండెంట్), కర్ని వెంకటరమణమూర్తి(ఇండిపెండెంట్), గెడ్డం అనిల్‌కుమార్‌రాజు(జైభారత్ నేషనల్ పార్టీ), టెక్కలిలో బైపల్లి పరమేశ్వరరావు(జైభారత్ నేషనల్ పార్టీ), కిల్లి విక్రాంత్(కాంగ్రెస్), దువ్వాడ శ్రీనివాస్(వైఎస్సార్ సీపీ), పాతపట్నంలో బొడ్డేపల్లి కృష్ణారావు(బీఎస్పీ–2 సెట్లు), అసపాన శంకరరావు(ఇండిపెండెంట్), మామిడి గోవిందరావు(టీడీపీ), శ్రీకాకుళంలో అంబటి కృష్ణారావు(కాంగ్రెస్–2 సెట్లు), ధర్మాన ప్రసాదరావు(వైఎస్సార్ సీపీ–2 సెట్లు), ధర్మాన ప్రసాదరావు(ఇండిపెండెంట్), గుజ్జల సూర్యనారాయణ(బీఎస్పీ), పానిల సంతోషమ్మ(ఇండిపెండెంట్), ఆమదాలవలసలో సువ్వారి గాంధీ(ఇండిపెండెంట్–3 సెట్లు), గురుగు రేవతి(జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ), సువ్వారి సత్యనారాయణ(ఇండిపెండెంట్), సువ్వారి దివ్య(ఇండిపెండెంట్), ఎచ్చెర్లలో కొత్తకొట్ల సింహాద్రినాయుడు(కాంగ్రెస్), గొర్లె కిరణ్‌కుమార్(వైఎస్సార్ సీపీ), గొర్లె పరిమళ(వైఎస్సార్ సీపీ), గంట్లాన రామారావు(బీఎస్పీ), నడుకుదిటి ఈశ్వరరావు(బీజేపీ–2 సెట్లు), నడుకుదిటి రజని(బీజేపీ–2 సెట్లు), నరసన్నపేటలో చీపురు రవి(జైభారత్ నేషనల్ పార్టీ), ధర్మాన కృష్ణదాస్(వైఎస్సార్‌సీపీ), ధర్మాన కృష్ణచైతన్య(వైఎస్సార్ సీపీ), బగ్గు రమణమూర్తి(టీడీపీ–2 సెట్లు) నామినేషన్లు దాఖలు చేశారు.

నామినేషన్ల పరిశీలన రేపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: నామినేషన్ల పరిశీలన ఈ నెల 26న ఉంటుందని, 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను ఉప సంహరించుకునేందుకు వీలుంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయన ఆర్వోలు, నోడల్ అధికారులతో సమావేశంలో మాట్లాడారు. నామినేషన్ల ఉప సంహరణ అనంతరం సింబల్ అలాట్‌మెంట్ జరుగుతుందని వివరించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఉండేందుకు ఆర్వోలకు శిక్షణ ఇచ్చామని, ఆ రోజు ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన ఉంటుందని తెలిపారు. మే 7 నుంచి 9 వరకు హోమ్ ఓటింగ్‌కు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఒక్కరోజులోనే పూర్తి చేసేలా టీమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు.

వడదెబ్బకు గుర్తు తెలియని మహిళ మృతి



మహిళ మృతదేహం

జి.సిగడాం: మండలంలోని మెట్టవలస బస్టాప్ వద్ద వడదెబ్బకు గురై గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. మెట్టవలస ప్రాంతంలోని శుభకార్యాలకు వచ్చిన ఈమె బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో వడదెబ్బకు గురై కుప్పకూలిపోయింది. వెంటనే స్థానికులు 108 అంబులెన్సులో రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం 5.30 గంటలకు మృతి చెందింది. మృతురాలు ఆకు పచ్చ జాకెట్, గులాబీ రంగు చీర కట్టుకుని, సుమారు 55 ఏళ్ల వయసుంటుందని, మృతదేహాన్ని రాజాం ప్రభుత్వం ఆసుపత్రిలో ఉంచామని, వివరాలు తెలిసిన వారు 6309990877 నంబర్‌ను సంప్రందించాలని ఎస్ఐ తెలిపారు.

నేడు 13 మండలాల్లో తీవ్ర వడగాలులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల ప్రకారం గురువారం జిల్లాలోని 13 మండలాల్లో తీవ్ర వడగాలులు, 15 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్ తెలిపారు.

ఆమదాలవలస, బూర్జ, గంగువారిసిగడాం, హిరమండలం, జలుమూరు, కోటబొమ్మాళి, లక్ష్మీనరసుపేట, నరసన్నపేట, పాతపట్నం, పొందూరు, సారవకోట, సరుబుజ్జిలి, టెక్కలి మండలాల్లో తీవ్రవడగాలులు వీచే అవకాశం ఉందన్నారు. అలాగే ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, కంచిలి, కొత్తూరు, లావేరు, మందస, మెళియాపుట్టి, నందిగాం, పలాస, పోలాకి, రణస్థలం, సంతబొమ్మాళి, శ్రీకాకుళం మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు. బుధవారం బూర్జ మండలంలో 42.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు పేర్కొన్నారు.



పర్లాకిమిడి: కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న బిజయ పట్నాయక్



పర్లాకిమిడి: మోహనా నియోజకవర్గం బీజేడీ అభ్యర్థిగా అంతర్యామి గొమాంగో నామినేషన్



పర్లాకిమిడి: ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా పైల మురళీకృష్ణ నామినేషన్



మల్కన్‌గిరి: కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న మాల్ల మాడీ

సందడే.. సందడి

- రాష్ట్రవ్యాప్తంగా నామినేషన్ల జోరు
- నేటితో ముగియనున్న గడువు



జయపురం: ర్యాలీగా నామినేషన్ వేసేందుకు వెళ్తున్న బీజేడీ అభ్యర్థి ఇందిరా నందో

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నాలుగో విడత నామినేషన్లకు గడువు సమీపిస్తుండడంతో బుధవారం పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి. అభ్యర్థులు తమ మద్దతుదారులతో ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు. వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి నామినేషన్లు వేసేందుకు బయల్దేరారు. వారితో పాటు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. నామినేషన్లకు నేటితో గడువు ముగియనుంది.

– సాక్షి నెట్‌వర్క్

అటు నామినేషన్.. ఇటు మాతృ వియోగం



ప్రదీప్ మజ్జి తల్లి సువర్ణ మజ్జి



నామినేషన్ వేస్తున్న ప్రదీప్ మజ్జి

కొరాపుట్: నబరంగ్‌పూర్ లోక్‌సభ బీజేడీ అభ్యర్థి ప్రదీప్ మజ్జి బుధవారం ఉద్వేగ పరిస్థితిని ఎదుర్కొన్నారు. వేలాది మంది ప్రజల సమక్షంలో ఆయన తన నామినేషన్ వేయడానికి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రకి నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన బయటకు వస్తుండగా విషాదకర వార్త తెలిసింది. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో విశాఖపట్నంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన తల్లి సువర్ణ మజ్జి(65) తుదిశ్వాస విడిచారు. దీంతో ఆయన హుటాహుటిన తన స్వగ్రామం జొరిగాం బయల్దేరి వెళ్లారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు సైతం ప్రచారం నిలిపివేశారు.



మల్కన్‌గిరి: నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేడీ అభ్యర్థి మానాస్ మద్కామి



జయపురం: నామినేషన్ దాఖలు చేస్తున్న ఇందిర నందో



మల్కన్‌గిరి: నామినేషన్ వేస్తున్న చిత్రకొండ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీప్రియ నాయక్



రాయగడ: రాయగడ నుంచి బీజేపీ అభ్యర్థిగా బసంత కుమార్ ఉలక నామినేషన్



రాయగడ: బిసంకటక్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నీలమాధవ ఉలక నామినేషన్ దాఖలు చేస్తున్న దృశ్యం



రాయగడ: బిసంకటక్ నుంచి బీజేపీ అభ్యర్థిగా జగన్నాథ నుండ్రుక నామినేషన్



బరంపురం: బీజేడీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న రమేష్ చంద్రచావ్ పట్నాయక్



రాయగడ: బిసంకటక్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ప్రాస్కా రామచంద్ర నామినేషన్



జయపురం: ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన బి.హరిరావు



కొరాపుట్: నబరంగ్‌పూర్ నుంచి బీజేడీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న కౌసల్య ప్రధాని



కొరాపుట్: జొరిగాం నుంచి బీజేడీ అభ్యర్థిగా రమేష్ మజ్జి నామినేషన్



రాయగడ: గుణుపూర్ నుంచి బీజేడీ అభ్యర్థిగా రఘునాథ్ గొమాంగో నామినేషన్




జయపురం: నామినేషన్ వేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి గౌతమ్ సామంతరాయ్



పర్లాకిమిడి: బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న కోడూరు నారాయణరావు



జయపురం: కోట్‌పాడ్ బీజేడీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన చంద్రశేఖర మఝి



కొరాపుట్ స్థానానికి బీజేడీ అభ్యర్థిగా నామినేషన్ వేయడానికి వెళ్తున్న ఎమ్మెల్యే రఘురాం పొడాల్



రాయగడ: గుణుపూర్ నుండి బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్తున్న త్రినాథ్ గొమాంగో

ఘనంగా అన్నదానం



ఆలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: స్థానిక జమాల్ వీధిలోని శ్రీరామాంజనేయ ఆలయ కమిటీ నిర్వహిస్తున్న శ్రీరామ నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నదానం నిర్వహించారు. దీంతో ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రాజకీయ నేతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్నవారిలో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, బీజేడీ జయపురం అభ్యర్థి డా.ఇందిరా నందో, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బి.సునీత తదితరులు పాల్గొన్నారు.



మద్దతుదారులతో అన్న ప్రసాదం సేవిస్తున్న ఇందిర నందో

అంబులెన్స్‌లో మంటలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం భారీగా ఎన్నికల నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో ఎండకు ప్రజలు సొమ్మసిల్లిపడిపోతే ఆదుకునేందుకు 108 అంబులెన్స్‌ను కలెక్టర్ కార్యాలయం వద్ద అధికారులు ఏర్పాటు చేశారు. అయితే అకస్మాత్తుగా అంబులెన్స్ డ్రైవరు సీట్‌లో మంటలు రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అనంతరం ప్రజలు, అంబులెన్స్ సిబ్బంది నీటితో మంటలను అదుపు చేశారు.



మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

దేవీ ఆశ్రమంలో భారీ చోరీ

- 30 తులాల బంగారం.. రూ.30 లక్షల నగదు చోరీ!
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలం దోమాం పంచాయతీ కొంచాలకూర్మయ్యపేట దేవీపీఠంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. సుమారు రూ.30 లక్షల నగదు, 30 తులాల బంగారం అపహరణకు గురైనట్లు భావిస్తున్నారు. ఆలయ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం..

ప్రస్తుతం దేవీపీఠంలో కోటి లింగార్చన ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి 1.30 గంటలవరకు పూజలు నిర్వహించి ఆలయాన్ని మూసివేశారు. మళ్లీ అర్ధరాత్రి 3.30 గంటలకు(బుధవారం వేకువజాము) ప్రత్యేక పూజల కోసం ఆలయం తెరిచేందుకు వేద పండితులు వెళ్లగా గ్రిల్స్, ప్రధాన ద్వారం తలుపులు తాళాలు, గడియలు విరగ్గొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా మూడు హుండీలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఒక హుండీ తెరిచి కానుకలు పట్టుకుపోగా, మిగతా రెండు హుండీలు సైతం కనిపించలేదు.



ఆలయంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

ఆలయ యాజమాన్యం సమాచారం మేరకు 30 తులాల అమ్మవారి ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలిసింది. మంగళవారం పౌర్ణమి పూజలు నిర్వహించడంతో ఆభరణాలతో అమ్మవారిని అలంకరించారు. వంద తులాలు వెండి, ప్రత్యేక పూజల కోసం సేకరించిన విరాళాలు రూ.30 లక్షలు వరకు చోరీకి గురైనట్లు చెబుతున్నారు. చోరీ నష్టంపై స్పష్టత లేదని, సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. విషయం తెలుసుకున్న క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలు పరిశీలించాయి. ఆలయంలో సీసీ కెమెరాల హార్డ్ డిస్క్ సైతం దుండగులు పట్టుకుపోయారు. ప్రస్తుతం ఆలయం పరిసర ప్రాంతాల ఇళ్లల్లో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. పీఠాధిపతి బాలభాస్కర శర్మ ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈదురుగాలుల బీభత్సం

మెళియాపుట్టి: మండలంలో బుధవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు మర్రిపాడు–సి గ్రామానికి చెందిన సిరిపురం శశివర్ణ అనే వృద్ధురాలిపై ఎండిన కొబ్బరి చెట్టు విరిగిపడటంతో గాయాలయ్యాయి. వర్షం పడుతున్న సమయంలో పెరటలో ఉన్న సామాన్లు తీయడానికి వెళ్లింది. పక్కనే ఉన్న ఎండుకొబ్బరి చెట్టు కాలిపై పడటంతో కిందపడిపోయింది. నడుముకు గాయమైంది. రట్టిణి గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌పై చెట్టు పడింది. విద్యుత్‌శాఖ అధికారులు చెట్టును తొలగించి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

డీఈఈ కార్యాలయంపై విరిగిపడిన చెట్టు

హిరమండలం: హిరమండలంలో బుధవారం సాయంత్రం వర్షంతో కూడిన గాలులు వీయడంతో గొట్టబ్యారేజ్ డీఈఈ కార్యాలయంపై చెట్టుపడి కార్యాలయం గోడ విరిగింది. కార్యాలయాన్ని తహసీల్దార్ బి.సుధాకర్ రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. డీఈఈ కార్యాయలం సిబ్బందితో మాట్లాడారు. ఎవరికి ఎటువంటి హాని జరగలేదని తహసీల్దార్ తెలిపారు.

క్లుప్తంగా

అధికలోడుతో 4 లారీల సీజ్


ఆర్‌టీఓ అధికారులు పట్టుకున్న లారీలు

బొండపల్లి: నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో వెళ్తున్న నాలుగు గని బుగ్గితో రవాణా అవుతున్న లారీలను పట్టుకొని సీజ్ చేసినట్లు ఆర్‌టీఓ ఐశ్వర్యలక్ష్మి బుధవారం తెలిపారు. మండల కేంద్రం మీదుగా విశాఖపట్టణం నుండి గజపతినగరం వైపు హరిత రహదారి నిర్మాణం కోసం నిబంధనలకు మించి అధికంగా నాలుగు లారీల్లో బుగ్గిని తీసుకువెళ్తుండగా అందిన సమాచారం మేరకు పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంటు సీఐ సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మహిళకు గాయాలు


కుక్కల కాటుకు గురైన మండల లక్ష్మి

జియ్యమ్మవలస: మండలంలోని సింగనాపురానికి చెందిన మండల లక్ష్మిపై బుధవారం ఉదయం కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఉదయం లక్ష్మి కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లగా ఆ సమయంలో కుక్కల మూక ఒక్కసారిగా ఆమెపై దాడి చేశాయి. చికిత్స నిమిత్తం చినమేరంగి సీహెచ్‌సీకి తరలించారు. వైద్య సేవలు పొందుతున్నారు.

కళాపై రెండు కేసులు

- అఫిడవిట్‌లో పేర్కొన్న కళా

చీపురుపల్లి: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కిమిడి కళా వెంకటరావుపై రెండు కేసులు ఉన్నాయని తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. బుధవారం నామినేషన్ దాఖలు చేసిన ఆయన ఎన్నికల అధికారులకు అఫిడవిట్ సమర్పించారు. అందులో రెండు కేసులు తనపై ఉన్నట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని ఆముదాలవలస మండలంలోని ఉల్లాసపేటలో పోలీస్ ఉత్తర్వులను ధిక్కరించినందుకు ఆముదాలవలస పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదై ఉంది. అలాగే రామతీర్థంలో వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డిపై హత్యాయత్నం చేసేందుకు చేసిన కుట్రలో భాగంగా నెలిమర్ల పోలీస్‌స్టేషన్‌లో తనపై కేసు నమోదై ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం ఫార్ట్యూనర్ కారులో తిరుగుతున్న ఆయన 2013లో కొనుగోలు చేసిన ఏపీ28 బీడబ్ల్యూ 0234 నంబర్ గల ఇన్నోవా కారు తప్ప మరే ఇతర వాహనాలు లేవని, తన భార్య పేరుతో అసలు వాహనాలే లేవని అఫిడవిట్‌లో పేర్కొనడం గమనార్హం.

వ్యక్తి ఆత్మహత్య


మృతుడు సీతారామరాజు

గంట్యాడ: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. గంట్యాడ మండల కేంద్రానికి చెందిన గుట్టుముక్కల సీతారామరాజు 15 రోజులుగా పనికి వెళ్లకుండా మద్యం సేవిస్తున్నాడు. పనికి వెళ్లకుండా మద్యం తాగుతూ ఉంటే ఎలాగని భార్య శైలజ అడిగినందుకు మనస్తాపానికి గురై మంగళవారం పురుగు మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు అతన్ని నెల్లిమర్ల మిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సురేంద్రనాయుడు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


గుర్తు తెలియని మహిళ మృతదేహం

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ బుధవారం మృతి చెందింది. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం మెట్టవలస బస్‌షెల్టర్ వద్ద అపస్మారక స్థితిలో ఉన్న మహిళను స్థానికులు గమనించారు. 108 సహాయంతో రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి జనసేన జిల్లా ప్రచార కార్యదర్శి

చీపురుపల్లి: జనసేన జిల్లా ప్రొగ్రామ్ కమిటీ ప్రచార కార్యదర్శి రేగిడి లక్ష్మణరావు ఆ పార్టీను వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. మెరకముడిదాం మండలానికి చెందిన లక్ష్మణరావు బుధవారం శ్రీకాకుళం జిల్లాలోని మేమంతా సిద్ధం బస్సు యాత్రలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. జనసేనను వీడి వచ్చిన ఆయనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కోఆర్డినేటర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాత, శిశు ఆరోగ్యానికి భరోసా


ఈ ఫొటోలో కనిపిస్తున్న బాలింత పేరు బూర్లి సరస్వతి. ఈమెది సాలూరు మండలం పురోహితునివలస. వారం రోజులు క్రితం ప్రసవం కోసం ఘోషాస్పత్రిలో చేరింది. ఈమెకు వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించి మూడు రోజులు క్రితం సిజేరియన్ చేశారు. ఆమెకు మగ బిడ్డ జన్మించాడు. ఒక్క పైసా ఖర్చు కాకుండా వైద్యులు ప్రసవం జరిపించడంతో ఆమె ఎంతో సంతోషిస్తుంది.

- ఘోషాస్పత్రిలో గర్భిణులు, శిశువులకు మెరుగైన వైద్యం
- తగ్గిన మాత, శిశు మరణాలు– ఐదేళ్లలో 30,023 ప్రసవాలు
- 10,381 మంది నవజాత శిశువులకు వైద్య సేవలు
- హైరిస్క్ గర్భిణులకు సైతం ప్రసవాలు


ఘోషాస్పత్రి

విజయనగరం ఫోర్ట్: ఉమ్మడి విజయనగరం జిల్లాలోనే అతిపెద్ద ఆస్పత్రి అయిన ఘోషాస్పత్రిలో మాత, శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. అవసరమైన అన్ని వసతులను జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గర్భిణులతో పాటు నవజాత శిశువుల ఆరోగ్యానికి, ప్రాణాలకు భరోసా ఇచ్చే విధంగా ఇక్కడ వైద్య సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిలో చేరిన గర్భిణులకు ప్రసవం జరిపిస్తున్నారు. అనారోగ్యంతో నవజాత శిశువుల ప్రత్యేక సంరక్షణ కేంద్రం (ఎస్ఎన్‌సీయూ)లో చేరిన వారు పూర్తిగా ఆరోగ్య వంతులయ్యే వరకు చికిత్స అందిస్తున్నారు. ఘోషాస్పత్రిలో ప్రసవాలతో పాటు గైనిక్ సమస్యలతో వచ్చే మహిళలకు శస్త్రచికిత్సలు కూడా చేస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రి మాదిరి ఇక్కడ కూడా ల్యాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఆస్పత్రికి వచ్చిన గర్భిణుల సమస్యలను ఘోషాస్పత్రి వైద్యులు ఎంతో ఓపికగా తెలుసుకుని అవసరమైన చికిత్స అందిస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా ఇక్కడ వైద్య సేవలు అందిస్తున్నారు. ఉత్తరాంధ్రలో మాత, శిశువులకు సేవలు అందించడంలో ఘోషాస్పత్రి పేరుగాంచింది. అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయి. దీంతో అధికశాతం మంది మహిళలు ఇక్కడ సేవలు పొందడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. గైనిక్కు సంబంధించి స్పెషలిస్టులు ఇక్కడ ఉండడంతో పీహెచ్‌సీ, సీహెచ్‌సీల నుంచి నిత్యం రిఫరల్స్ వస్తున్నాయి. వీటికి కూడా ఇక్కడ సేవలు వైద్య సిబ్బంది అందిస్తున్నారు. దీంతో ఆస్పత్రిలో చేరిన రోగులు సేవల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు చెందిన గర్భిణుల ప్రసవం కోసం ఘోషాస్పత్రికి వస్తున్నారు. జిల్లాతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని రణస్థలం, జి.సిగడాం, విశాఖపట్నం జిల్లా పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాల నుంచి గర్భిణులు వస్తున్నారు. హైబీపీ, బీపీ, షుగర్ ఉన్నవారు, హెచ్ఐవీ, క్షయ, రక్తహీనత, గుండె జబ్బులు ఉన్న రోగులను హైరిస్క్ గర్భిణులుగా గుర్తిస్తారు. అటువంటి హైరిస్క్ రోగులను పీహెచ్‌సీ, సీహెచ్‌సీల నుంచి ఘోషాస్పత్రికి రిఫర్ చేస్తారు. హైరిస్క్ గర్భిణులకు సుఖ ప్రసవం అయిన వారికి సుఖ ప్రసవం జరిపిస్తారు. సిజేరియన్ అవసరం అయిన వారికి సిజేరియన్ చేస్తారు.

2019 నుంచి 2023 వరకు ఆస్పత్రిలో జరిగిన ప్రసవాల వివరాలు

సంవత్సరం	ప్రసవాల సంఖ్య
2019	7,561
2020	6,849
2021	5,988
2022	4,991
2023	4,631

2019 నుంచి 2023 వరకు సేవలు పొందిన శిశువుల వివరాలు

సంవత్సరం	శిశువుల సంఖ్య
2019	1694
2020	1919
2021	2090
2022	2218
2023	2460


ఈ ఫొటోలో కనిపిస్తున్న శిశువుది పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం చెముడు గ్రామం. పార్వతీపురం ఏరియా ఆస్పత్రిలో మామిడి పల్లవి ఈ శిశువుకు జన్మనిచ్చింది. నెలలు నిండకుండా 840 గ్రాములతో శిశువు జన్మించింది. దీంతో ఆ శిశువుకు శ్వాసకోశ సమస్య రావడంతో అక్కడ వైద్యులు ఘోషాస్పత్రికి ఎస్ఎన్‌సీయూకి రిఫర్ చేశారు. ఆస్పత్రిలో చేరిన వెంటనే ఎస్ఎన్‌సీయూ వైద్యులు సీపీఏపీ మెషిన్‌పై ఉంచి చికిత్స అందించారు. శిశువుకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. దీంతో శిశువు బరువు 1.4 కేజీలకు పెరిగింది. ఆరోగ్యంగా ఉండడంతో వైద్యులు డిశ్చార్జ్ చేశారు.


ఎన్‌సీయూలో చికిత్స పొందుతున్న శిశువు


ఫోటోథెరపి పరికరంలో చికిత్స పొందుతున్న శిశువు

ల్యాప్రోస్కోపిక్ సర్జరీలు

కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాదిరి ఘోషాస్పత్రిలో కూడా ఆధునాతన వైద్య పరికరాలను ఉపయోగించి శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ల్యాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు అపోలో, కేర్ వంటి కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేస్తారు. అటువంటి ల్యాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు ఘోషాస్పత్రిలో కూడా చేస్తున్నారు. నెలకు 40 నుంచి 50 వరకు శస్త్రచికిత్సలు చేస్తున్నారు.

ఐదేళ్లలో 30,023 ప్రసవాలు

ఘోషాస్పత్రిలో గడిచిన ఐదేళ్ల కాలంలో వేలాది మందికి ప్రసవం జరిపించారు. 2019 నుంచి ఇప్పటి వరకు 30,023 మందికి సేవలు అందించారు. అదేవిధంగా 2019 నుంచి ఇప్పటి వరకు 10,381 మంది శిశువులకు సేవలు అందించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన మహిళలు


ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సమక్షంలో పార్టీలో చేరిన మహిళలు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే హైమావతి

శృంగవరపుకోట: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అతివలను అన్నగా ఆదుకున్న జగన్‌మోహన్‌రెడ్డి పట్ల మహిళలు తమ ప్రేమాభిమానాలు చూపిస్తున్నారు. దీనితో స్వచ్ఛందంగా పార్టీలోకి చేరుతూ అన్నకు అండగా ఉంటాం అంటూ ముందుకు వస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే... శ్రీనివాసకాలనీలో బుధవారం ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు జనం నీరాజనం పట్టారు. ఇందులో మహిళలు తాము వైఎస్సార్‌సీపీలో చేరుతామన్నారు. దీంతో ఎమ్మెల్యే శ్రీనివాసరావు సరే అనటంతో పెద్ద సంఖ్యలో మహిళలు సిద్ధమయ్యారు. దీంతో వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కండువాలు కప్పుకున్న మహిళలు జైజగన్ అంటూ నినాదాలు చేశారు. అందరికీ అన్ని పథకాలు ఇచ్చి మంచి చేసిన జగనన్న గెలుపు కోసం పని చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హైమావతి, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, పార్టీ అధ్యక్షుడు మోపాడ కుమార్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ రహ్మాన్, కృష్ణాపురం సర్పంచ్ యామినీదేవి, అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి, ఏఎంసీ డైరెక్టర్ పార్వతి, వార్డు సభ్యులు, ఎమ్పీటీసీలు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తప్పుడు రాతలు, ప్రచారాలు చేస్తే సహించేది లేదు..

- భూక్రయవిక్రయాల్లో తనకు సంబంధం ఉందని నిరూపిస్తే దేనికైనా సిద్ధం
- ఈనాడు, ఏబీఎన్(ఆంధ్రజ్యోతి) పత్రికల్లో తప్పుడు కథనాలపై పరువు నష్టం కేసు వేస్తా..
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం : బొండపల్లి మండలంలో చంద్రబాబు ఏర్పాటు చేసిన మహిళా గళంలో ఒక మహిళ అన్యాక్రాంతంగా తన భూమిని కబ్జా చేశానని తనపై చేసిన దుష్ప్రచారాన్ని పచ్చ పత్రికలు ఈనాడు, ఆంధ్రజ్యోతి భూతద్దంలో చూపిస్తూ రాసిన కథనాలను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఖండించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తప్పుడు రాతలు, ప్రచారాలు చేస్తే సహించేది లేదన్నారు. తప్పుడు కథనాలు ప్రచురించిన పత్రికలపై పరువు నష్టం కేసులు వేస్తానన్నారు. ఈ రెండు పత్రికల్లో కథనాలు నిరూపించే దుమ్ము, ధైర్యం ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలకు ఉన్నాయా! అని సవాల్ చేశారు. నిరూపిస్తే దేనికైనా సిద్ధమని అన్నారు. పచ్చ పత్రికలను తెలుగుదేశం పార్టీ కరపత్రాలుగా వాడుకుంటుందన్నారు. శ్రీధర్ అనే వ్యక్తి రెండేళ్లుగా నా భూమిని కాపాడుకుంటూ వస్తున్నాడని గజపతినగరానికి చెందిన ఒక మహిళ టీవీ ప్రచారంలో చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మక్కువ శ్రీధర్ రెండేళ్లుగా వైఎస్సార్‌సీపీలోనే నా వెంటే ఉండేవాడని ఒక్కసారైనా ఆ మహిళ సమస్యను తనకు చెప్పలేదన్నారు. నాపై బురద చల్లేందుకు టీడీపీ ఆ పార్టీ మహిళలతో డ్రామాలు ఆడుతుందన్నారు. మహిళా గళం కార్యక్రమంలో చంద్రబాబు తన పాలనలో చేసిన ఒక్క అభివృద్ధి కార్యక్రమాన్ని చెప్పలేకపోవడం విడ్డూరమన్నారు. టీడీపీకి చెందిన మహిళలతో తప్పుడు ఆరోపణలు చేయించి మరింత దిగజారుడుతనానికి చంద్రబాబు, ఆ పార్టీ శ్రేణులు పాల్పడ్డారని మండిపడ్డారు. చెల్లూరు వద్ద మంగళవారం నిర్వహించిన సిద్ధం సభను విజయవంతం చేసిన ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట పార్టీ సీనియర్ నాయకుడు నారాయణమూర్తి రాజు, మండల పార్టీ అధ్యక్షుడు బూడి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.ఆదినారాయణ, సీనియర్ నేతలు బెల్లాన త్రినాధరావు మండల సురేష్, రేగ సురేష్, కంది తిరుపతినాయుడు, మంత్రి నరసింగరావు తదితరులు ఉన్నారు.

నాడు

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు.. రేషన్ కార్డులు, రైతులకు కావాల్సిన భూ పత్రాలు.. పింఛన్ దరఖాస్తులు.. ఆధార్ సేవలు ఇలా.. ఏ ప్రభుత్వ సేవకు దరఖాస్తు చేయాలన్నా మండల కేంద్రానికి పరుగు తీయాలి. వ్యయప్రయాసలుకోర్చాలి. అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేయాలి. అప్పటికీ పని పూర్తవుతుందోలేదో తెలియదు. ధ్రువీకరణ పత్రం ఎప్పుడు చేతికందుతుందో అంతుపట్టదు.

నేడు

ఊరు/వార్డుకో సచివాలయం.. 11 మంది ఉద్యోగులు.. ఏ పని ఎన్నిరోజుల్లో పూర్తవుతుంతో తెలిపే బోర్డులు.. సంక్షేమ, అభివృద్ధి పనుల వివరాలు.. గడువులోగా చేతికందుతున్న వివిధ ధ్రువీకరణ పత్రాలు.. ఎలాంటి వ్యయప్రయాసలు లేకుండా ఊరిలోనే అందుతున్న ప్రభుత్వ సేవలు.. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సిద్ధించేలా పాలన.. ఇదీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పౌర సేవల్లో స్పష్టంగా కనిపిస్తున్న విప్లవాత్మక మార్పు.

ప్రజలకు అందుబాటులోనే ప్రభుత్వ సేవలు


సచివాలయాల ఏర్పాటుతో ప్రభుత్వ సేవలు సులభంగా అందుతున్నాయి. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు క్షణాల్లో జారీ అవుతున్నాయి. పింఛన్లకు సచివాలయంలోనే దరఖాస్తు చేసుకుంటున్నారు. ప్రజల చెంతనే పాలన ఉండం అద్భుతం. సచివాలయ సిబ్బందికి దరఖాస్తు చేసే వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా 13,500 చొప్పున నా ఖాతాకే జమవుతోంది.

– సుంకరి జగ్గారావు, జాకేరు, రైతు, వేపాడ

సచివాలయాలు.. సేవా నిలయాలు



- సచివాలయ వ్యవస్థతో అక్కరకు వచ్చిన ప్రభుత్వ సేవలు
- తప్పిన వ్యయప్రయాసలు
- ఊరు/వార్డు సచివాలయంలో అందుతున్న 555 రకాల సేవలు
- పనుల్లో పెరిగిన వేగం
- సంతోషంలో పల్లె, పట్టణ ప్రజలు

విజయనగరం అర్బన్: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన సచివాలయ వ్యవస్థతో పల్లె/పట్టణ ప్రజలకు ప్రభుత్వ సేవలు అక్కరకు వచ్చాయి. పైసా ప్రయాణ ఖర్చులేకుండా ఊరు, వార్డులోనే సేవలు అందుతున్నాయి. పాలనలో వేగం పెరిగింది. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు మంజూరవుతున్నాయి. అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయి. వాటిపై పర్యవేక్షణ పెరిగింది. నిధుల దుబారా తగ్గింది. సచివాలయ సేవలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అధికారులు, సిబ్బంది సేవలపై ప్రశంసల జల్లు కురుస్తోంది.

సేవల్లో ముందంజ

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి 2019 అక్టోబర్ 2న సచివాలయ వ్యవస్థను ప్రారంభించారు. మరుచటి ఏడాది జనవరి 26 నుంచి ఆన్‌లైన్ సేవలు మొదలయ్యాయి. ఈ సచివాలయాల ద్వారా జిల్లాలో 2023 డిసెంబర్ వరకు అందించిన సేవల నమోదును పరిశీలిస్తే రాష్ట్ర స్థాయిలో జిల్లా మొదటి ఐదు స్థానాల్లో నిలుస్తోంది. జిల్లాలోని సచివాలయాల ద్వారా అందించిన వాటిలో టాప్ 20 సర్వీసులను మాత్రమే తీసుకుంటే 22.04 లక్షల సేవలు అందాయి. వీటిలో అత్యధికంగా రెవెన్యూ విభాగం సేవలు 11.44 లక్షలు నమోదయ్యాయి.

సచివాలయాల్లో అందించే ప్రధాన సేవలు

సచివాలయాల్లో అందిస్తున్న సమారు 555 సేవల్లో 20 సేవలను అత్యధికమంది పొందారు. కులధ్రువీకరణ, ఓబీసీ, ఆర్ఓఆర్, ఆదాయ ధ్రువ పత్రాలు, పట్టాదార్ పాస్ పుస్తకాలు, డెత్ సర్టిఫికెట్లు తదితర సేవలను అధికమంది సద్వినియోగం చేసుకున్నారు. పౌర సరఫరాలకు సంబంధించి రైస్ కార్డులు, కార్డుల విభజన, నూతన కార్డుల మంజూరు, విద్యుత్ శాఖకు సంబంధించి విద్యుత్ బిల్లుల చెల్లింపులు, కొత్త కనెక్షన్ల సేవలు పొందారు. పంచాయతీరాజ్ శాఖకుక సంబంధించి వైఎస్సార్ పింఛన్లు, వ్యవసాయశాఖకు సంబంధించి రైతు భరోసా, సబ్సిడీ విత్తనాలకు దరఖాస్తు చేసి సేవలు పొందుతున్నారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి శాఖ శిక్షణ కోసం అనేక మంది రిజిస్ట్రేషన్లు చేసుకుంటూ, ప్లేస్‌మెంట్‌ల కోసం వారి బయోడేటాలను నమోదు చేసుకుంటున్నారు.

కష్టాలు తీరాయి


గతంలో ఏ చిన్న సర్టిఫికెట్ కావాలన్నా, ఏ ఆఫీసులో పనికావాలన్నా మండల కేంద్రానికి పరుగుతీయాల్సి వచ్చేది. పనులు మానుకుని ప్రభుత్వ కార్యాలయాల్లో వేచి ఉండాల్సి వచ్చేది. అధికారుల కోసం పడిగాపులు కాసేవారం. రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. ఏం కావాలన్నా సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేస్తే చాలు.. పని అయిన తర్వాత మా సర్టిఫికెట్ ఫోన్‌లో వాట్సాప్‌కి పెట్టేస్తున్నారు. లేదంటే వలంటీర్ ఇంటికి తెచ్చి సర్టిఫికెట్ అందజేస్తున్నారు. దరఖాస్తు పరిష్కారం ఏ స్థాయిలో ఉందన్న విషయం తెలియజేస్తున్నారు. ఇంతకంటే మంచి పాలన ఇంకెక్కడ ఉంది. అందుకే.. ఇతర రాష్ట్రాలు కూడా మన సచివాలయ వ్యవస్థను అధ్యయనం చేస్తున్నాయి. జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపు, పారదర్శక పాలనకు సచివాలయాలే నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

– లగుడు శ్రీనివాసరావు, ధర్మవరం గ్రామం, ఎస్.కోట మండలం


విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

ఏ సేవకు ఎంతకాలం

సచివాలయాలకు అందే దరఖాస్తుల పరిష్కారానికి ప్రతి సేవకు ఒక నిర్ధిష్ట కాలపరిమితిని ప్రభుత్వం విధించింది. బియ్యం కార్డు కోసం దరఖాస్తు చేస్తే 10 రోజుల్లో, ఆరోగ్యశ్రీ కార్డు కోసం 20 రోజులు, పింఛన్ కార్డుకు 10 రోజులు, ఇళ్ల పట్టాలందజేయడానికి 90 రోజుల కాలం పరిమితిని విధించింది. దరఖాస్తులను గ్రామ స్థాయిలో విచారణ జరిపి లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపికచేసే వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది.

2022 జనవరి 26 నుంచి డిసెంబర్ 2023 వరకు జిల్లాలోని సచివాలయాల ద్వారా అందిన టాప్-20 సర్వీసుల సంఖ్య ఇలా..

ప్రభుత్వ శాఖ	సర్వీసులు	సంఖ్య
రెవెన్యూ శాఖ	కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు	11,44,226
	ఆర్ఓఆర్ 1బీ సర్టిఫికెట్స్, ఆర్ఓబీ1బీ	2,05,777
	కంప్యూటరైజ్డ్ అడంగల్	50,573
	మ్యూటేషన్ ట్రాన్సాక్షన్	48,087
	రీ ఇష్యూ సర్టిఫికెట్స్	38,511
	ఓబీసీ సర్టిఫికెట్స్	37,433
	వాటర్ ట్యాక్స్ పేమెంట్	20,697
	ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్స్	17,150
బిల్ పేమెంట్ సర్వీస్	ఎలక్ట్రికల్ బిల్ పేమెంట్	3,89,441
	సీడీఎంఏ-ప్రాపర్టీ ట్యాక్స్ పేమెంట్	39,976
సివిల్ సప్లై	రేషన్ కార్డుల్లో చేర్పులు	50,276
గ్రామ, వార్డుసచివాలయం	ల్యామినేషన్ సర్వీసులు	48,279
ఆధార్	డిమోగ్రాఫిక్ అప్‌డేట్	38,910
	జగనన్న సురక్ష ఆధార్ లింకింగ్ మొబైల్	24,313
	డాక్యుమెంట్ అప్‌డేట్	14,834
కార్మిక శాఖ	ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎస్టాబ్లిమెంట్ లా	19,709
పంచాయతీ రాజ్ శాఖ	ఓల్డ్ ఏజ్ పింఛన్స్	16,027